ప్రజాశక్తి

శనివారం 30 ఆగస్టు 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

అదును పోతుందనే భయాందోళనలు...

యూరియా కోసం పరుగులు...

ప్రజాశక్తి-పామర్రు : కృష్ణాజిల్లా పామర్రు మండలంలో యూరియా కొరత రైతులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. సాధారణంగా పంట సాగులో మూడుసార్లుగా రైతులు ఎరువులను వినియోగిస్తున్నారు. ఈ మూడు దశల్లోనూ యూరియాను తప్పనిసరిగా వాడుతున్నారు. మొదటి దశలో వేయాల్సిన యూరియా రైతులకు అరకొరగానే అందింది. ప్రస్తుతం రెండో దశ ఎరువులు వేయడానికి రైతులు కష్టపడుతున్నారు. ఎక్కడ చూసినా వారికి యూరియా లభించడం లేదు. పామర్రు మండలంలో 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్‌లు), 8 ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వీటన్నిటి ద్వారా మండలంలో ఉన్న రైతుఅందరికీ కావాల్సిన ఎరువులను సక్రమంగా అందించాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. ఏ సహకార సంఘంలోనూ, ఎరువుల (మిగతా 2లో)

ఇండెంట్లు పంపాం, రాగానే ఇస్తాం

శివ నాగమణి, మండల వ్యవసాయాధికారి, పామర్రు

ప్రస్తుతం యూరియా కొరత కొంత మేర ఉందని పామర్రు మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి తెలిపారు. మిగిలిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆయా సహకార సంఘాలు, ఏజెన్సీల ద్వారా ఇండెంట్లు పంపామని యూరియా రాగానే అందరికీ అందిస్తామని తెలిపారు.

ఎక్కువ ధర చెల్లించడం భారంగా మారింది

జువ్వనపూడి సుమన్, కౌలు రైతు. రిమ్మనపూడి.

ఎన్నో ఏళ్లుగా పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. వ్యవసాయ ఖర్చులన్నీ రకాలుగా పెరిగిపోయాయి. కౌలు కూడా గత ఏడాది కంటే ఎక్కువ చెల్లిస్తున్నాను. ఈ పరిస్థితుల్లో ఎరువులకు ఎక్కువ ధర చెల్లించడం భారంగా మారింది.

నిడుమోలు వెళ్లి అధిక ధరకు కొనాల్సి వచ్చింది

సందోలు చంటి, సన్న కారు రైతు, పెదమద్దాలి.

కొద్దిగా సొంత భూమి ఉంది. దానికి తోడు కొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. స్థానిక సహకార సంఘంలో ఎరువులు లేవు. నిడుమోలు వెళ్లి అధిక ధర చెల్లించి యూరియా కొనాల్సి వచ్చింది.

కొరత తీవ్రంగా ఉంది

కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, చాట్లవానిపురం, పామర్రు.

ఎరువుల కొరతతో చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. యూరియా అసలు దొరకడం లేదు. ఒకవేళ దొరికినా దానికి తోడుగా వేరే మందులు ఏవైనా తప్పనిసరిగా కొంటేనే ఇస్తున్నారు. అది అనవసరమైన ఖర్చు అనిపిస్తోంది.

విఎంసి రాబడికి గండి

- అద్దె చెల్లించకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు
- ఎస్టేట్ ఆస్తులు దుర్వినియోగం
- ప్రేక్షకపాత్రలో అధికారులు, పాలకవర్గం

ప్రజాశక్తి-విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన వందల కోట్ల నిధులను రాబట్టడంలో ఘోరంగా విఫలమైన విఎంసి పాలకవర్గం, స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం విఎంసి పరిధిలో ఆయా విభాగాల పరిధిలో సైతం పూర్తిస్థాయిలో నగరపాలక సంస్థకు రాబడిని రాబట్టలేకపోతున్నారు. ఆయా విభాగాల్లో కోట్లాది రూపాయలు భారీ మొత్తంలో విఎంసి కోల్పోతుండగా, పలువురు బడా వ్యాపారులకు కల్పవృక్షంగా తయారైంది. తమకున్న రాజకీయ, ఆర్థిక అండదండలతో పలువురు బడా వ్యాపారులు, బడాబాబులు విఎంసి ఖజానాకు గండి కొడుతున్నారు. విఎంసికి ఎస్టేట్ విభాగంతో పాటు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇతర పలు విభాగాల నుంచి వందల కోట్లు రాబడి వస్తూ ఉంటుంది. మునిసిపల్ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుంటూ రాజకీయ, ఆర్థిక పలుకుబడి కల్గిన పలువురు బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు వందల కోట్ల విలువ చేసే ఎస్టేట్ ఆస్తులను చేజిక్కించుకొని బీనామీల పేరుతో రకరకాల మార్గాల ద్వారా తమ సొంత ఆస్తులుగా చేసుకుని తద్వారా భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీ ఏళ్ల తరబడి జరుగుతున్నా విఎంసి అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే చర్చ జరుగుతోంది.

విఎంసిలోని ఎస్టేట్ విభాగానికి చెందిన వందల సంఖ్యలోని షాపులను ఏళ్ల తరబడి పలువురు వ్యాపారులు నడుపుకుంటూ విఎంసికి చెల్లించాల్సిన నెలవారీ అద్దెలు చెల్లించడం లేదు. ఇదేమని అడిగే పరిస్థితి కూడా లేకుండా పోయింది. గుడ్ విల్, అద్దెల రూపంలో విఎంసికి చెల్లించకుండా, మరొక వైపున ఖాళీ చేయకుండా జోరుగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో దీర్ఘకాలంగా ఎవరెవరు వ్యాపారాలు చేస్తున్నారని పరిశీలించిన సంబంధిత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 170 షాపులు ఉన్నట్లు గుర్తించారు. మూడు సర్కిళ్ల పరిధిలో సుమారు 110కి పైగా విఎంసి షాపులకు తాళాలు వేస్తూ సీజ్ చేసే పనిలో అధికారులు ఉన్నారు. గడువు ముగిసినా, (మిగతా 2లో)

యూరియాపై ఆందోళన చెందొద్దు

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-పామర్రు

యూరియా పట్ల రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ సమృద్ధిగా అందుబాటులో ఉంచుతామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం పామర్రులోని మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి పక్కన గల సంధ్య ఆక్వా పరిశ్రమ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కనుమూరు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు కలెక్టర్‌ను కలిసి యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేవని, సకాలంలో ఎరువులు అందించి ఆదుకోవాలని కోరారు. కనుమూరు సొసైటీకి వచ్చిన యూరియాను గ్రామంలోని రైతులకు కాకుండా బయట వ్యక్తులు తీసుకుపోతున్నారని, దీని వల్ల గ్రామంలోని రైతులు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా పక్కదారి పట్టకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని, తనిఖీలు చేయించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొంత మంది రైతులు అవసరం మేరకు కాకుండా ఎక్కువ మొత్తంలో ముందుగానే స్టోర్ చేసుకుంటున్నారని, దీని వల్ల ఇతర రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది సరైనది కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి కాంత్, ఆర్ఐ రాము, సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్లే ఉపాధ్యాయులు!

- దొడ్డదేవరపాడు పాఠశాలలో భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టులు

ప్రజాశక్తి-వీరులపాడు

మండలంలోని దొడ్డదేవరపాడు జిల్లా పరిషత్ పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యా కమిటీ చైర్మన్లే ఉపాధ్యాయులుగా మారారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధ్యాయుల కొరతపై విద్యా కమిటీ చైర్మన్ దంపతులు ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో విద్యా కమిటీ చైర్మన్ దంపతులే విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన దొడ్డదేవరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు బోధన కుంటుపడుతుందని భావించి విద్యా కమిటీ చైర్మన్ దంపతులు స్వర్గం శ్రీహరి, నాగ శిరోమణి స్వచ్ఛందంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఎన్నో ఇబ్బందులు కోర్చి పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయించి విద్యార్థుల సంఖ్యను కూడా పెంచడం జరిగింది. ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్, బయాలజీ, ఫిజిక్స్, రెండు ఎస్జీటీ పోస్టులు ఎవరూ కోరుకోకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. దీంతో ద్యార్థులకు బోధన విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని విద్యా కమిటీ చైర్మన్ శ్రీహరి భావించి పాఠశాలలో స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నారు. దొడుదేవరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు విద్యను అందించటం ఇబ్బంది అవుతుందని, వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ నాయకులు గోపినాయక్, మండల నాయకుడు షేక్ జాన్‌సైదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

'గిడుగు' సేవలు చిరస్మరణీయం

తెలుగు భాషా దినోత్సవంలో కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ

తెలుగు భాషను ఆధునిక పద్ధతిలో ఆలోచించి, భాష ఔనత్యాన్ని చాటి చెప్పండంలో గిడుగు రామ్మూర్తి పంతులు అందించిన సేవలు చిరస్మరణీయమని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు డికె బాలాజీ, డా.జి.లక్ష్మీశ అన్నారు. తెలుగు భాషా దినోత్సవరం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని మచిలీపట్నంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలుగు తల్లి విగ్రహానికి కలెక్టర్ బాలాజీ, విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండితులకు మాత్రమే పరిమితమైన తెలుగు భాషను సరళతరం చేసిన మహనీయులు గిడుగు రామ్మూర్తి పంతులు అని ప్రశంసించారు. వాడుక భాష ఉద్యమంతో ప్రతి తెలుగు వాడికి తెలుగు భాషను అందుబాటులోకి తెచ్చిన పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులన్నారు. తెలుగు భాషను ఆధునిక పద్ధతిలో ఆలోచించిన భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. తెలుగు భాష గొప్పదనాన్ని కమ్మదనాన్ని చాటి చొప్పిన గిడుగు రామ్మూర్తి తెలుగు ప్రజల హృదయాలలో చిరస్మరనీయులుగా నిలుస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు బాల్యం నుండే తెలుగు భాషలో మాట్లాడడం, రాయడం, చదవడం నేర్పించి తెలుగు భాషను భావితరాలకు అందించడంలో భాగస్వామ్యులు కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏవో రాధిక, డిఎంఅండ్‌హెచ్‌వో ఎం సుహాసిని, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డిఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు పాల్గొన్నారు.

రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న కలెక్టర్లు

వ్యర్థాల నుండి సంపద సృష్టి

ప్రజాశక్తి-విజయవాడ: వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరగాలని, వ్యర్థాల నుండి సంపదను సృష్టించాలని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా దుర్గాపురం, భాను నగర్, అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్సుర్ స్టేషన్, డోర్నకల్ రోడ్డు, లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు ప్రాంతాలను కమిషనర్ పర్యటించి, క్షేత్ర స్థాయిలో శానిటేషన్ నిర్వహణ, డ్రైయినేజి పరిస్థితి తదితర పరిస్థితులను పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

యూరియా కోసం పరుగులు

దుకాణంలోనూ మచ్చుకైనా యూరియా కనబడటం లేదు. దీంతో రైతులు చేనుకు అదును పోతుందనే భయంతో యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే సొసైటీలకు చేరిన ఎరువులను బడా భూస్వాములు రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఎక్కువగా తరలించుకుని పోయారని చిన్న, సన్నకారు, కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. యూరియా కోసం వారు తమ గ్రామ పరిధిలోని సహకార సంఘాలలోనే కాకుండా ఇతర గ్రామాలలోని సంఘాల కార్యాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు పడుతున్నారు. అక్కడ కూడా వారికి యూరియా లభించడంలేదు. మండల కేంద్రంలో ఉన్న ఎరువుల షాపులలోను వారికి నిరాశే ఎదురవుతోంది. పామర్రు మండలం దాటి చుట్టుపక్కల ప్రాంతాలైన గుడ్లవల్లేరు, గుడివాడ మండలాలతోపాటు నిడుమోలు కూడా వెళ్లి ఎరువుల కోసం ప్రయత్నిస్తున్నారు. రహస్యంగా ఎరువులను అమ్ముతున్న కొంతమంది వ్యాపారులు రూ.270లకు అమ్మాల్సిన యూరియా బస్తాను రూ.700 చొప్పున విక్రయిస్తున్నారు. ఇన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చి వ్యవసాయం చేసే తమకు వాతావరణంలో కూడా ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయని అంటున్నారు. వేసవి నుండి ఇప్పటివరకు ఎండవేడిమిలో తీవ్రత తగ్గని కారణంగా వరి ఎదుగుదల సరిగా లేదంటున్నారు. ఇటీవల ఒక రోజులోనే అత్యధిక వర్షం కురవడంతో చేలన్నీ ముంపునకు గురై కొంత నష్టం జరిగిందంటున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు యూరియా కొరత లేదని, కొరత రానీయబోమని రైతులకు భరోసా ఇస్తున్నా ఆచరణలో అది ఇప్పటివరకు సాధ్యం కాలేదు. వ్యవసాయ పరపతి సంఘాలు, ఎరువుల వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల మధ్య సమన్వయం లోపించడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సేద్యం ప్రారంభం నుండీ కష్టాలే...

పగలనకా రాత్రనకా ఎండనకా వాననకా నిరంతరం శ్రమిస్తూ భూమి సేద్యంతో పంటలు పండించి అందరికీ అన్నం పెట్టే తమను ఆదుకునే వారే కరువయ్యారని పలు గ్రామాల్లోని కౌలు, చిన్న, సన్నకారు రైతులు ఆవేదన చెందుతున్నారు. పామర్రు మండలంలో 21 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తుండగా, దీనిలో అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులే సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది తొలినాటి నుండే వీరికి కష్టాలు మొదలయ్యాయి. నారుమళ్లు పెరిగే సమయంలో వానలు కరువయ్యాయి. కాల్వల ద్వారా అందిన అరకొర నీటిని తోడడానికి ఇంజన్ల కిరాయి ఆయిల్ ఖర్చులు భరించాల్సి వచ్చింది.

విఎంసి రాబడికి గండి

అద్దెలు చెల్లించకుండా అక్రమంగా వ్యాపారాలు నడుపుకుంటున్న షాపులన్నింటిపై సుమారు రూ.కోటిన్నరకు పైగా రాబడి విఎంసికి రావచ్చునని అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. 3500 షాపులు, 23 కమ్యూనిటీ హాల్స్, 14 కళ్యాణ మండపాలు, మరో ఎనిమిది కర్మల భవనాలు, పలు పార్కింగ్ స్థలాలు, తదితర విఎంసి ఎస్టేట్ ఆస్తుల రూపంలో ఉన్నాయి. గుడ్‌విల్, అద్దెలు తదితర వివిధ రూపాల్లో వీటన్నింటి ద్వారా ఏడాదికి రూ.32 కోట్లు రాబడి వస్తుంటుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.12 కోట్ల వరకు రాబడి వచ్చినట్లు సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం ఈ-టెండర్ విధానం ద్వారా ఖాళీగా ఉన్న 14 షాపులకు ఆక్షన్ పెట్టగా, వచ్చే నెల ఎనిమిదవ తేదీన వీటికి సంబంధించి టెండర్ ఓపెన్ చేస్తామని ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ ఎ శ్రీధర్ తెలిపారు. ఎస్టేట్ ఆస్తుల దుర్వినియోగంపై ఇఒను వివరణ కోరగా పూర్తి స్థాయిలో రాబడిని రాబట్టడానికి పలు రూపాల్లో చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అయితే తక్కువగా ఉన్న ఆర్ఐలను, ఇతర సిబ్బందిని భర్తీ చేసుకుని విఎంసి ఆస్తులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

పల్లె ప్రగతితోనే వికసిత్ భారత్ : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. గ్రామాల సుస్థిర అభివద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని బలంగా నమ్మిన మహాత్ముని ఆశయాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమంతో పాటు ఎన్నో అభివద్ధి పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తున్నాయని, వీటి ఆసరాతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు సమష్టిగా కషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.పంచాయతీ అభివద్ధి సూచిక (పీఏఐ-పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్) 2.0పై శుక్రవారం ఎంజీ రోడ్డులోని పంచాయతీరాజ్ శాఖ సమావేశ మందిరంలో కార్యశాల జరిగింది. జెడ్‌పీటీసీలు, ఎంపీడీవోలు తదితరులు హాజరైన ఈ వర్క్‌షాప్‌నకు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాత్మాగాంధీ, డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలతో పాటు ఆధునిక తెలుగు భాష వైతాళికుల్లో ఒకరైన గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఐరాస సుస్థిర అభివద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనలో భాగంగా గ్రామ పంచాయతీల సంస్థాగత సామర్థ్యాలను పెంచేందుకు, ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ పీఏఐ 1.0ను రూపొందించిందని.. ఇప్పుడు దీన్ని ఆధునీకరించి పీఐఏ 2.0గా మార్చడం జరిగిందన్నారు. ఈ సూచీ కింద పేదరికం లేని, మెరుగైన జీవనోపాధులు కలిగిన పంచాయతీబీ ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, బాలిక స్నేహపూర్వక గ్రామ సంచాయతీ, నీరు సమద్ధిగల గ్రామ పంచాయతీ, పచ్చదనం, పరిశుభ్రత కలిగిన గ్రామ పంచాయతీ, స్వయం సమద్ధి, మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామ పంచాయతీ, సామాజిక న్యాయం-సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీ, సుపరిపాలన కలిగిన గ్రామ పంచాయతీ, మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ అనే తొమ్మిది ఇతివత్తాల్లో 147 సూచికలు ఉన్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీల్లో ప్రగతిని అంచనా వేసేందుకు, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించేందుకు, కొత్త విధానాలు, ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సూచీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమష్టి భాగస్వామ్యంతో లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ డీఎల్‌డీవో ఎస్.నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

129 కొత్త పోలింగ్ బూత్‌లు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్నికల నిర్వహణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలను రూపొందించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహం అన్నారు.స్థానిక కలెక్టరేట్ ఎవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 1792 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో 295 పోలింగ్ కేంద్రాలలో 1200 మంది ఓటర్లు మించి ఉన్నారన్నారు. అదనంగా ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రంలో విలీనం చేసి కొత్తగా మరో 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సంబంధిత ప్రతిపాదనలను రూపొందించామన్నారు. వీటితో ప్రస్తుతం ఏర్పాటు చేసిన 129 పోలింగ్ కేంద్రాలతో కలిపి జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1921 కి చేరిందన్నారు. పోలింగ్ కేంద్రం వారీగా బూతు స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

విజయవాడకు చేరుకున్న బౌద్ధ ధర్మ యాత్ర

ప్రజాశక్తి-విజయవాడ: బుద్ధుని బోధనలు.. శాంతి, కరుణ, సోదరభావానికి ప్రతీకలని, ఈ గొప్ప సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, దక్షిణాసియా అంతటా సాంస్కృతిక, వారసత్వ పర్యాటకాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఐక్యతా మార్గంలో సాగుతున్న ట్రై సర్వీసెస్ లార్డ్ బుద్ధా సర్క్యూట్ మోటారు సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. దేశ త్రివిధ దళాల అధికారులు, యువ ప్రతినిధులు పాల్గొంటున్న ఈ యాత్ర శుక్రవారం విజయవాడకు చేరుకోగా కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి స్వాగతం పలికి, అభినందనలు తెలియజేసిన అనంతరం జెండా ఊపి యాత్రను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సమగ్రత, లౌకికత్వం, ఐక్యతను చాటిచెప్పేందుకు ముఖ్యమైన బౌద్ధ చారిత్రక ప్రదేశాలను కవర్ చేస్తూ ఈ ధర్మ యాత్ర సాగుతోందని.. ఈ విశిష్ట యాత్రకు ఆతిథ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ బౌద్ధ ప్రదేశాల విశిష్టతను చాటిచెప్పేందుకు ఈ యాత్ర దోహదం చేస్తుందన్నారు. ఈ మోటారు సైకిల్ యాత్రకు బిమ్స్‌టెక్ సెక్రటేరియట్, నలంద యూనివర్సిటీ, ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తదితరాలు మద్దతు అందిస్తున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాహుల్ లక్ష్మణ్ పాటిల్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, సాంస్కృతిక శాఖ అధికారి సుమన్, ఘంటసాల ప్రభుత్వ సంగీత నత్య కళాశాల నాట్యాచార్యుడు అజయ్ కుమార్, గాత్ర అధ్యాపకురాలు త్రివేణి, భరతనాట్యం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిఎంఒహెచ్ డాక్టర్ అర్జునరావు

పారిశుధ్యం మెరుగుదలకు కృషి : సిఎంఒహెచ్

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలోని ఆయా డివిజన్లలో శానిటేషన్ మెరుగుదలకు శానిటరీ ఇనిస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, దిగువ స్థాయి సిబ్బంది కృషి చేయాలని ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ కె అర్జునరావు ఆదేశించారు. విఎంసి నూతన భవనం మీటింగ్ హాల్లో ప్రజా ఆరోగ్య విభాగం శాఖధిపతి డాక్టర్ కె. అర్జునరావు సిబ్బందితో పారిశుధ్య నిర్వహణపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...100 శాతం డోర్ టూ డోర్ కలెక్షన్ జరగాలని, ప్రతిరోజు సైడ్ కాలువలలో పూడికలు తీయాలని, కంపాక్టర్ బీన్స్ లో 75 శాతం వ్యర్థాలు నిండిన వెంటనే వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లతో 50 శాతం నిర్వహణ వ్యయం ఏర్పాట్లను ప్రోత్సహించాలని, ప్రస్తుతం నాలుగు ప్రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అమలులో ఉండగా మిగతావి కూడా అదేవిధంగా ప్రోత్సహించాలని అన్నారు. అధికారుల అనుమతి తీసుకోకుండా క్షేత్ర స్థాయి సిబ్బంది విధులకు గైరుహాజరు కాకూడదని అన్నారు. ఆఫీస్ వారి అనుమతితోనే సెలవు తీసుకోవాలని కోరారు. వ్యాపారస్తులు రోడ్డుపైన వ్యర్థాలను పారివేయకుండా అవగాహన కల్పించే విధంగా శానిటరీ ఇన్స్పెక్టర్ చర్యలు తీసుకోవాలని, ప్రతి షాప్ ముందు వారు చెత్తబుట్టను ఏర్పాటు చేసే విధంగా వాళ్ళకి తెలియపరచాలని లేనిచో అపరాధ రుసుము విధించాలని అన్నారు. అక్టోబర్ రెండవ తేదీ 2025వ సంవత్సరం నాటికి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధమును అమలు చేయాల్సిన సందర్భంగా ప్రభుత్వం వారి ఆదేశాల ప్రకారం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2021 అమలు చేయవలెనని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాసన్, డాక్టర్ గోపాలకష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్, రెడ్డి బయాలజిస్ట్ కేశవరావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION AT VIJAYAWADA)
O.S.NO. 1481/2024

Between:
Bhimisetti Ruthvika Naga Annapurneswari, being Minor Represented by her mother and natural guardian Bhimisetti Bhargavi ... Plaintiff
And
Bhimisetti Aparna & 3 others ... Defendant 1 to 4
Defendant No. 2 :
Bhimisetti Vinod Kumar, S/o. late Venkata Rao ... Defendant No. 2
Defendant No. 4 :
Nukala Bhavani @ Bhanu, W/o. Venkata Krishna ... Defendant No. 4
4th floor, Ganesh Towers, D.V.R. Colony, Backside of Krishnaveni School, Jaggaiahpeta, N.T.R. District-521175.

పైన తెలిపిన దావాలో O.S.NO. 1481/2024 లో మీరు 2 మరియు 4వ ప్రతివాదులైయున్నారు. పై దావాలో హాజరు నిమిత్తము శ్రీ కోర్టువారు ది.10-09-2025 వాయిదా అయి ఉన్నది. కావున మీరు గాని, మీరు తరపు న్యాయవాది గాని సదరు వాయిదా రోజు ది. 10-09-2025వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు సదరు కోర్టుకు హాజరు కావలసినదిగా మీకు తెలియ జేయడమైనది. మీరు ఆ రోజు కోర్టుకు హాజరు అవ్వని యెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానము చేయగలరు.

ఇట్లు
కోసూరు వెంకటేశ్వరరావు, ఈడే వాసుదేవరావు
జె.వి. కోటేశ్వరరావు, అడ్వకేట్స్
ఫోన్: 9030785229

IN THE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION AT VIJAYAWADA)
I.A. NO. 710/2024 in O.S.NO. 1481/2024

Between: Bhimisetti Ruthvika Naga Annapurneswari, being Minor Represented by her mother and natural guardian Bhimisetti Bhargavi ... Petitioner / Plaintiff
And
Bhimisetti Aparna & 3 others ... Respondant / Defendant 1 to 4
Respondant / Defendant No. 2 :
Bhimisetti Vinod Kumar, S/o. late Venkata Rao ... Defendant No. 2
Respondant / Defendant No. 4 & 2
address to : Nukala Bhavani @ Bhanu, W/o. Venkata Krishna ... Defendant No. 4
4th floor, Ganesh Towers, D.V.R. Colony, Backside of Krishnaveni School, Jaggaiahpeta, N.T.R. District-521175.

పైన తెలిపిన దావాలో I.A. NO.710/2024 O.S.NO. 1481/2024 లో మీరు 2 మరియు 4వ రెస్పాండెంట్ / ప్రతివాదులైయున్నారు. పై దావాలో హాజరు నిమిత్తము శ్రీ కోర్టువారు ది.10-09-2025 వాయిదా అయి ఉన్నది. కావున మీరు గాని, మీరు తరపు న్యాయవాది గాని సదరు వాయిదా రోజు ది. 10-09-2025వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు సదరు కోర్టుకు హాజరు కావలసినదిగా మీకు తెలియ జేయడమైనది. మీరు ఆ రోజు కోర్టుకు హాజరు అవ్వని యెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానము చేయగలరు.

ఇట్లు
కోసూరు వెంకటేశ్వరరావు, ఈడే వాసుదేవరావు
జె.వి. కోటేశ్వరరావు, అడ్వకేట్స్
ఫోన్: 9030785229

OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION KRISHNA, MACHILIPATNAM.
'E' Procurement Short Tender Notice
Short Tender Notice.No.05/DB/EE/APEWIDC/2025-26, Dated 29.08.2025.

Tenders are invited for Major and minor Repairs to SW Hostels Works of 4 Nos. **(Vide NIT. Nos.19 to 22)** of APEWIDC., Division in Krishna District on e- procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place i.e., www.apeprocurement.gov.in.

Bid Document Downloading Start Date from : 01.09.2025.
Bid Document Downloading End Date : 08.09.2025 up to 3.00 PM.
Bid Submission Closing Date : 08.09.2025 up to 4.00 PM.
Bid Opening Date : 08.09.2025 @ 5.00 PM.

Sd/- Executive Engineer,
APEWIDC, Krishna, Machilipatnam.

ప్రశాంతంగా నిమజ్జనాలు నిర్వహించుకోవాలి : ఎస్పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వినాయక చవితి నిమజ్జనాల సందర్భంగా ప్రజలందరూ శాంతి భద్రతలు పాటిస్తూ పోలీసు శాఖ సూచనలు అనుసరించాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంబంధిత మునిసిపల్, స్థానిక సంస్థలు, రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేకంగా నిమజ్జన పాయింట్లు గుర్తించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తం 569 నిమజ్జన పాయింట్లు గుర్తించామని అందులో అవనిగడ్డ సబ్ డివిజన్ 81 గుడివాడ సబ్ డివిజన్ 144 బందరు సబ్ డివిజన్ 174 గన్నవరం సబ్ డివిజన్ 170 ఉన్నాయన్నారు.కావున జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, మతసామరస్యానికి భంగం వాటిల్లకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు చేసుకోవాలన్నారు. కేవలం కేటాయించిన నిమజ్జన పాయింట్ల వద్దే విగ్రహ నిమజ్జనం చేయాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధం గా డీజేలు, మద్యం సేవించడం, రహదారులపై అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కుట్టుమిషన్లు అందిస్తున్న దృశ్యం

కుట్టుమిషన్లు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పి4 కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుందని నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెంలో గ్రామపంచాయతీ వద్ద పి4 సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని అయిదుగురు నిరుపేద ఎస్టి మహిళలకు పి ఫోర్ కార్యక్రమం ద్వారా గ్రామ సర్పంచ్ పంద్రాజు నాగ వెంకట అంకమ్మ ప్రసాద్ ఆర్థిక సహాయంతో కుట్టు మిషన్లు అందజేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి సాయిబాబు, గ్రామ కార్యదర్శి ఉదయలక్ష్మి, వీఆర్వో చాందిరీలత, ఎంపీటీసీ కటికల వాసంత్ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో డిజెలు పెట్టొద్దు : సిఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : గణేష్ ఉత్సవాల్లో డీజేల ముందు డాన్సులు చేయడం సరికాదని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విపరీతమైన డీజెబాక్స్ ల శబ్దాల వలన బాలింతలు, గర్భిణీలు, పిల్లలు, వద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని పేర్కొన్నారు. మద్యంసేవించి డీజే బాక్సుల శబ్దాల ముందు డాన్సులు చేసే వారికి కూడా మున్ముందు పలు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయన్నారు.

రెండోరోజూ డిఎస్సి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : డీఎస్సీ 2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ రెండవ రోజు స్థానిక నోబుల్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. అబ్జర్వర్ ప్రసన్న కుమార్, కష్ణా,ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖా ధికారులు పివిజె. రామారావు,యువి. సుబ్బారావు లతో కలిసి పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. రెండవ రోజు 136 మంది అభ్యర్థులు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నారు. గురువారం మొదటి రోజు హాజరు కాని 20 మందికి రెండవ రోజు అవకాశం కల్పించారు. మొత్తం 1188 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా, మొదటి రోజు 1048 మంది, రెండవ రోజు 136 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. గైర్హాజరైన వారి జాబితాను రాష్ట్ర విద్యాశాఖకు పంపించామని, వారి ఫోన్ నంబర్లుకు సమాచారం అందిన వెంటనే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని తెలియజేస్తామని కష్ణా జిల్లా డీఈఓ పివిజే. రామారావు తెలిపారు. ఇకపై ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగిస్తామని వెల్లడించారు. యుటిఎఫ్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకరావు ఆద్వర్యంలో అభ్యర్థుల సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగు : మండలి

బహుమతులు అందిస్తున్న మండలి వెంకట్రామ్, డిఎస్పి

ప్రజాశక్తి-అవనిగడ్డ : క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు సూచించారు. శుక్రవారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండా క్రీడా పతాకం ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వి కొత్తపాలెం జడ్పీ హైస్కూల్లో ఇటీవల నిర్వహించిన అవనిగడ్డ సబ్ జోన్ ఆటలు క్రీడల పోటీల విజేతలకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డిఎస్పి తాళ్లూరి విద్యా శ్రీ క్రీడాజ్యోతి వెలిగించి మండలి వెంకట్రామ్‌కి అందజేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబా, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఎంపీడీవో వనజ కుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - గుడివాడ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 25, 26 తేదీలలో గుడివాడ అర్బన్, రూరల్, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు అండర్ 14, అండర్ 16 విభాగాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభనందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ ఫుట్, డిస్కస్ త్రో పోటీలలో ఎస్‌జివిఎస్‌జి మున్సిపల్ హై స్కూల్, బేతవోలు హైస్కూల్ విద్యార్థులైన కె పూజిత(డిస్కస్ త్రో - మొదటి, షాట్ ఫుట్ - 2వ స్థానం), ఎస్ సంజన(100 మీటర్లలో - 3స్థానం), పి నందిని(లాంగ్‌జంప్ - 2వ స్థానం), ప్రశాంత్ సాయి (డిస్కస్ త్రో - 1వ స్థానం),ఎల్ ప్రేమ్ కుమార్ (డిస్క్ త్రో - 2వ స్థానం), సిహెచ్ జ్ఞానేశ్వర్ (డిస్క్ త్రో - 3వ స్థానం),ఎం అఖిల్ బాబు (షాట్‌పుట్ - 3వ స్థానం),ఎన్ సాయి కిరణ్ (లాంగ్‌జంప్ - 1వ స్థానం, 100 మీటర్లు - 3వ స్థానం) విజేతలుగా నిలిచారు. వీరందరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య, పిఇటి సతీష్ కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అందరూ అభినందించారు.

కలవపాముల పిఎసిఎస్ సిఇఒ, అసిస్టెంట్‌పై కేసు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కలపపాముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అమ్మకాల్లో అవకతవకలకు సంబంధించి సంఘం సీఈవో రోజారమణి, సేల్స్ మెన్ నాగదుర్గపై 6ఏ కేసు నమోదుచేసినట్టు వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్ శుక్రవారం తెలిపారు. సంఘానికి వచ్చిన యూరియా అమ్మకాలకు సంబంధించి బిల్లుల్లో దిద్దుళ్లు, కొందరు రైతుల పేరిట డూప్లికేట్ బిల్లులో యూరియా తీసుకున్నట్టు చూపించడంతో అవకతవకలు జరిగాయాని వచ్చిన ఆరోపణలపై వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ, రెవిన్యూ అధికారుల బందం మూడు రోజుల పాటు రికార్డులు, బిల్లుపుస్తకాలు తనిఖీ చేసిన అధికారులకు యూరియా అమ్మకాల్లో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో ఇద్దరిని బాధ్యులను చేస్తూ 6ఏ కేసు నమోదుచేసి, తగిన చర్యలకు సహకారశాఖ అధికారులకు నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. సంఘంలో అమ్మకాలకు ఇందుపల్లి సంఘానికి ప్రస్తుతం అప్పగించినట్టు సునీల్ తెలిపారు. యూరియా అవకతవకలపై ఆర్డీవో హేలాషారోన్ గురువారం తనిఖీబృందంతో కలసి పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా యూరియా అమ్మకాల అవకతవకలే కాకుండా గుర్తింపులేని కంపెనీల నుంచి లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన లిక్విడ్ ఎరువులు, గుళికలు ఇతర మందులు కొనేవారులేక మూడు సంవత్సరాల నుండి సంఘం గోదాములో మూలుగుతూ సంఘానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లేలా చేసిన దానిపై ఎవరు విచారణ జరుపుతారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోదండరామయ్య మృతికి నివాళి

నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్టణ తీర ప్రాంతం అభివృద్ధి సాధించాలని నిత్యం తపించిన కొక్కిలిగడ్డ కోదండ రామయ్య శుక్రవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. పోర్టు సాధన ఉద్యమంలోగానీ, పులిగడ్డ - పెనుమూడి వంతెన, కోస్తా జతీయ రహదారి మచిలీపట్టణం మీదుగా మాత్ర మే నిర్మిచాలని జరిగిన ఉద్యమాలలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. అలాగే మచిలీపట్టణం - రేపల్లె రైల్వే లైన్ సర్వేకు నిధులు కేటాయించడానికి అయన చేసిన ప్రయత్నాన్ని మచిలీపట్నం దివిసీమ ప్రాంత ప్రజలు మరువలేరని పలువురు ప్రముఖులు కొనియాడారు. మెడికల్ డిపార్టుమెంటులో చిరు ఉద్యోగాన్ని నిర్వహించి .. పదవి విరమణ అనంతరం వచ్చే పెన్షన్ ను ఈ ప్రాంత అభివద్ధికి జరిగే ఉద్యమాలకు వెచ్చించేవారని పలువురు కొనియాడారు.

నందమూరి హరికృష్ణకు నివాళి

ప్రజాశక్తి-పామర్రు : ఎన్టీఆర్ తనయుడు, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే వర్ల సోదరుడు వర్ల చైతన్య హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా టిడిపి సహాయ కార్యదర్శి చాట్ల పెద రమేష్, పంచాయతీ సభ్యుడు మంతెన రామాంజనేయులు,రవి, దాలిపర్తి ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : స్థానిక టీడీపీ కార్యాల యంలో నందమూరి హరికృష్ణ చిత్రపటం వద్ద నేతలు నివాళులు అర్పించారు. టీడీపీ సీనియర్ నేత తుమ్మలపల్లి హరికృష్ణ ఈ సందర్భంగా హరికృష్ణ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీను, యేనుగ జయ, వీరంకి శ్యామ్ పాల్గొన్నారు.

కంకిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆడబిడ్డలను ఆర్థికంగా బరోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతమైనందుకు శుక్రవారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర మంత్రి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష అభివద్ధికి చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం మంత్రి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడబిడ్డలను మరింత ముందుకు తీసుకుపోయిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద రాష్ట్రంలో ఉన్న బస్సులలో 74 శాతం బస్సులను కేటాయించారని, చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలకు 1500 నుంచి 2వేల రూపాయల నెలవారీ ఖర్చులు ఆదా అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బందరువాసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు జీ ధనలక్ష్మిని మంత్రి, ఆర్టీసీ చైర్మన్ ఘనంగా శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు మంత్రి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఆర్టిసి ఆర్ఎం వెంకటేశ్వర్లు, డిఎం పెద్దిరాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-గన్నవరం : విద్యార్థి దశ నుండే పఠనాసక్తినీ పెంపొందించుటకు పుస్తకాలు ఎక్కువగా చదువుకొని ప్రయోజకులు కావాలని గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు రవి అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం చేర్పించారు. ఈ సభ్యత్వాలకు సంబంధించిన రుసుమును రొటేరియన్ జాస్తి వెంకట కష్ణా రావు పిల్లల్ని ప్రోత్సహిస్తూ ఇచ్చిన ఆర్థిక సహాయంతో చెల్లించారు. గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు జీవి రవిబాబు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ .సునీల , రొటేరియన్ నర్రా సీతారామ రావు, రోటరీ క్లబ్ సెక్రటరీ లైబ్రేరియన్ కె నాగరాజు పాల్గొన్నారు. గ్రంథాలయాలను పూర్తిగా ఉపయోగించుకొని మంచి ప్రయోజకులు అవ్వాలని విద్యార్థులకు వక్తలు సూచించారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

• సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు డిమాండ్

ర్యాలీలో పాల్గొన్న బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాంలో భాగంగా 50 వ డివిజన్ 170వ సచివాలయం పరిధిలో శుక్ర వారం ఇంటింటికి లార్వా సర్వే చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించే కరపత్రాల పంపిణీ చేపట్టారు. లార్వా పుట్టుక దోమల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, శానిటరీ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ పారుదల సక్రమంగా లేకపోవడంతోపాటు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. నగరం గుండా ప్రవహించే ఏలూరు, బందర్ కాలువల పారుదల వ్యవస్థ మెరుగుపరిచి లార్వా నివారణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచి దోమలు వ్యాప్తి చెందకుండా సహకరించాలని కోరారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

విజయవాడ అర్బన్ : బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరో దశ విద్యుత్తు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు తెలిపారు. విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలకు నివాళులర్పిస్తూ మొగలరాజ పురంలోని సిపిఎం కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర కమిటీ సభ్యుడు స్టాలిన్, నాయకులు దావులూరి శ్రీనివాసరావు, లంకపలస ధర్మారావు, పాల్గొన్నారు

తెలుగు భాషపై యువతకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

తెలుగు భాష, సంస్కృతి పట్ల యువతకు అవగాహన అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ సత్యనారాయణపురంలోని శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎ.ఎల్.ఎస్.మూర్తి మాట్లాడుతూ.. మన భాష, మన సంస్కృతి గురించి నేటి యువత తెలుసుకోవాలన్నారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి అని కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు రామమూర్తి వేషధారణలో పాఠశాల 8వ తరగతి విద్యార్థి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ బహుమతులను అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

• గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థల సంఘం ద్వితీయ మహాసభ విజయవాడలోని ఠాగూర్ స్మారక గంథాలయంలో శుక్రవారం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురిందపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శాఖా గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపునకు కృషి చేస్తానని, జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను నేరుగా సంస్థ ఖాతాలలో జమ చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మరో విశిష్ట అతిథిగా సభకు విచ్చేసిన సంఘం జెఎసి రాష్ట్ర చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు, పనివేళల మార్పు కోసం కృషి చేస్తానని తెలిపారు.



వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా హరీష్ నియామకం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన 50వ డివిజన్‌కు చెందిన కామరాజ్ హరీష్ కుమార్ ఆచారి శుక్రవారం స్థానిక బ్రాహ్మణ వీధిలోని విజయవాడ పశ్చిమ వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు.. కామరాజ్ హరీష్ కుమార్ ఆచారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావాలని తెలిపారు.

షాదీ ఖానా కమిటీ నియామకం

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ షాదీ ఖానా నిర్వహణ కోసం ఒక కొత్త కమిటీ నియామకమైంది. కమిటీ చైర్మన్‌గా సయ్యద్ షాబుద్దీన్, సభ్యులుగా షేక్ జాన్ సైదా, షేక్ గౌస్ యాభీ, షేక్ ఖాసిం, షేక్ జానీలను నియమించారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, సయ్యద్ అన్వర్, షేక్ మదర్ సాహెబ్, షేక్ అస్లాం పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి-విజయవాడ

డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి జి. ఝాన్సీ తెలిపారు. 64వ డివిజన్ కండ్రికలో ఐద్వా డివిజన్ మహాసభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కెశ్రీదేవి, జి.ఝాన్సీ పాల్గొని మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు సరైన అవకాశాలు లేక చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మగవారి సంపాదన మద్యం షాపులకు పోవడంతో కుటుంబ భారం మొత్తం మహిళలపై పడుతుందన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎనుకున్నారు. కార్యదర్శిగా పి.పిచ్చమ్మ, అధ్యక్షులుగా జి.లత, ఆఫీస్ బేరర్స్‌గా జి.సావిత్రి, దేవి, యశోద, కమిటీ సభ్యులుగా శ్రీలక్ష్మి, కె.పద్మ, వరలక్ష్మి, నిర్మల, సారిక, జరీనా, దుర్గలను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని రజకుల ధర్నా

ఇబ్రహీంపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద రజకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ.. రజకులకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని, ఇస్త్రీ చేస్తున్న వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ ధోబీ పోస్టు భర్తీ చేయాలని, రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ చిక్కవరపు వెంకట రెడ్డయ్య మాట్లాడుతూ.. కొండపల్లిలో చెరువును శుభ్రం చేసి కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చెరువు వద్ద చెత్తను ఎత్తేయాలని అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో రజకులు ధర్నాకు సిద్ధపడ్డారని తెలిపారు. ధర్నాలో తాళ్లూరు శ్రీనివాసరావు, శీద్రాలు శ్రీనివాసరావు, లింగాల పార్వతమ్మ, పాల్గొన్నారు.

కొండపల్లి ఖిల్లాపై యువకుల వీరంగం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న కొండపల్లి ఖిల్లాపై యువకులు వీరంగం చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వినాయక చవితి సెలవు రోజు కావడంతో యువకులు మందు చిందులతో హంగామా చేసినట్లు స్థానికులు తెలిపారు. కార్లు, బైకలతో ఖిల్లా పైకి సుమారు 50 మంది యువకులు వచ్చి మద్యం సేవించారు. మత్తులో ఖిల్లాపై నానా హంగామా సృష్టించారు. దీంతో పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. కార్లతో సైరన్ వేసి కేరింతలు కొడుతూ నానా హడావిడి చేశారు. బైకలతో విన్యాసాలు చేస్తూ పర్యాటకులను భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం రెండు గ్రూపులుగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని భయానక వాతావరణం సృష్టించారు. ఆనందంగా గడుపుదామని వచ్చి పర్యాటకులు వీరి హంగామాకు భయపడి ఖిల్లా నుండి తిరిగి వెళ్లిపోయారు. ఖిల్లాపై నిఘా కొరవడటం వల్లనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని సందర్శకులు అభిప్రాయం పడుతున్నారు. పర్యాటక ప్రదేశమైన కొండపల్లి ఖిల్లాపై భద్రత పెంచాలని సందర్శకులు కోరుతున్నారు.

పలుచోట్ల తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

మైలవరం : తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని వివేకానంద పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు శ్రీనివాసరావు, రాజారెడ్డిలు, తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పాటలు, పద్యాలు, సామెతలు, కవితలు, పొడుపు కథలు, నాటికలు, ఉపన్యాసాలు, శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజ కవుల సభ విధానం, రాగయుక్తంగా పద్యాలు పాడి పలువురిని విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

తిరువూరులో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

తిరువూరు : తిరువూరులో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాలయాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగార్జున, శ్రీనిధి, సిద్దార్థ, భాష్యం, గీతం, మున కళ్ళ, ముష్టికుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కమిటీ ఆధ్వర్యంలో తిరువూరులోని విజ్ఞాన కేంద్రంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షులు తోట ఉమామహేశ్వరరావు, ధన సుందరరావు పూల మాలవేసి నివాళులర్పిం చారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కనుమరుగవుతున్న తెలుగు భాషను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు, ప్రజా సంఘాల నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, ఎం.హరికృష్ణ, ఎల్.గంగాధర్, పి.గోపి, శోభన్ బాబు పాల్గొన్నారు.

విజయవాడ సిటీ : విజయవాడ వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.శ్యామలానంద ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలుగు కేవలం ఒక భాష కాదని, అది మన గుర్తింపు అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్ ప్రసంగిస్తూ మాతృ భాష కేవలం సమాచార మార్పిడికి సాధనం కాదని, సమాజం యొక్క చరిత్ర, సంప్రదాయాలు, విలువలకు వాహకమని చెప్పారు. తెలుగు భాష సాహిత్య, శాస్త్రీయ రచనల గురించి సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం అధిపతి డాక్టర్ ఓ.భాను శేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిత్త అమర్ సుధీర్, కోశాధికారి డాక్టర్ కాజా రాఘవ, కెబిఎన్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ జె.వి.చలపతి రావు, సి.యస్.సి విభాగం అధిపతి డాక్టర్ డి.దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ కాకాని వెంకటరత్నం కళాశాలలో శుక్రవారం తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రాయప్ప, భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎర్రం రెడ్డి గాంధీ కిషోర్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కిషోర్, కళాశాల వ్యాయామశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, ధ్యాన్చంద్, కళాశాల అధ్యాపకులు డేవిడ్ పాలు బాబు, వాసుదేవరావు, కొండ్రు రమేష్, డాక్టర్ పులి రజనీకాంత్, ఏలూరు పిచేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువుల తవ్వకాలు

• ప్రశ్నించిన రైతులపై కేసులు • ఓ ఎంఎల్ఎ, మాజీ ఐఎఎస్ అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వంలోని అధికార, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అనుమతులు లేకుండానే అక్రమ చెరువులను పెద్ద ఎత్తున పొక్లెయిన్లతో తవ్వుతున్నారు. మండలంలోని విన్నకోట ఆవుల దొడ్డిలో వందల ఎకరాల్లో రొయ్యలను పెంచేందుకు చెరువులను బడా బాబులు అక్రమంగా తవ్వుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ అక్రమ తవ్వకాల్లో కూటమి ప్రభుత్వానికి చెందిన ఒక ఎమ్మెల్యేతో పాటు ఒక మాజీ ఐఏఎస్ కూడా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని బాధిత స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతుల పొలాల్ని సైతం తమ అనుమతి లేకుండా ఎందుకు తవ్వారని ప్రశ్నించే సత్తా ఈ ప్రాంతంలో ఎవరికీ లేదు. తన అనుమతి లేకుండా ఎందుకు తవ్వారని అడిగిన ఒక రైతుపై చెరువుల వద్దనే రౌడీ మూకలు భౌతిక దాడులకు దిగారు. అంతేగాక ప్రశ్నించిన ఆ రైతులపై అక్రమ కేసులను బనాయించారు. దీనితో ఆ చెరువుల వద్దకు వెళ్లాలంటే ఎవరికైనా గుండెలు చాలటం లేదు. చెరువుల వద్దకు ఎవరు వచ్చినా...కాళ్లు విరిచేస్తామని తవ్వకం దారులు హుకుం జారీ చేశారు. కేవలం కూటమి ప్రభుత్వంలోని బడా బాబుల ప్రోద్బలంతోనే తాము చెరువులను తవ్వుతున్నామని నిర్వాహకులు బాహాటంగానే చెప్పుకోవటంతో ఏ అధికారి ఆ చెరువుల జోలికి వెళ్లటం లేదు. కనీసం వచ్చిన ఫిర్యాదులను కూడా పట్టించుకోకుండా బుట్ట దాఖలు చేస్తున్నారు. స్థానిక ఆవుల దొడ్డిలోని చిన్న, సన్నకారు రైతుల పొలాల్ని కూడా ఆక్రమించి అడ్డూ అదుపు లేకుండా చెరువులు తవ్వేస్తున్న నిర్వాహకులు స్థానికుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎవరు మాట్లాడినా బూతు పదజాలంతో నోరేసుకోని పడిపోతున్నారు. లేకపోతే కొట్లాటకు దిగేందుకు ముఠాలను కూడా చెరువుల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. ఆవులదొడ్డి ప్రాంతంలోని సామాన్య రైతులు తమ పొలాల దగ్గరకు వెళ్లాలన్నా కష్టతరంగా మారింది. అక్రమ చెరువుల తవ్వకం దారులు అడ్డుకుంటున్నారు. పదికో...పరకకో పొలాల్ని అమ్ముకుని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ తవ్వకం దారులు రుబాబు చేస్తున్నారు.

చుట్టుపక్కలున్న ప్రభుత్వ భూములతో పాటు లీజుకు ఇవ్వనటువంటి రైతుల భూములను కూడా ఆక్రమించేస్తున్నారు. ఎసైన్డ్ భూముల్లో కూడా తవ్వకాలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అనుమతులు లేని చెరువులకు కరెంట్ ఇచ్చేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిపై వీఆర్వో నరసింహారావు వివరణ ఇస్తూ...చెరువుల తవ్వకాలు అక్రమంగా జరిగినా...తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చెరువులకు కరెంట్ అనుమతి కూడా ఇవ్వవలసి వచ్చిందని చెప్పారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు

'విద్యావికాస్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ యన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 'విద్యావికాస్' విద్యార్థులు ప్రతిభచాటారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యావికాస్ పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కొమ్మినేని సాంబశివారావు మాట్లాడుతూ విద్యావికాస్‌లో 9వ తరగతి విద్యార్థులు బోశెట్టి యోగేశ్వర్, లక్ష్మణ్ షాట్ పుట్‌లో, గొరిపర్తి బాలు మహీధర 400 మీ రన్నింగ్ రేస్‌లో ద్వితీయ స్థానాలు సాధించి మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ చాట్రగడ్డ నాగమల్లేశ్వర రావు చిన్నారులకు అభినందనలు తెలియజేశారు.

వర్సిటీలో క్రీడా వసతులకు చర్యలు

• కెయు ఉపకులపతి ఆచార్య కె. రాంజీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో క్రీడా వసతుల కల్పనకు ఖేలో ఇండియా పథకం కింద నలభై రెండు కోట్లతో ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వంకు పంపామని ఉపకులపతి ఆచార్య కె. రాంజీ వెల్లడించారు. జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మేజర్ ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో కష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యములో అఖిల భారత విశ్వవిద్యాలయాల స్థాయిలో మహిళల నెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా తెలుగు భాషా వికాసం కోసం గిడుగు రామ్మూర్తి చేసిన కషిని శ్లాఘించారు. మాతభాష ను నిర్లక్ష్యం చేయకుండా ఆంగ్లభాషపై పట్టు సాధించాలన్నారు. వికసిత భారత్ 2047 - యువ కనెక్టింగ్ నోడల్ అధికారి డా ఎల్. సుశీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 18 సార్లు రాష్ట్ర హాకీ జట్టు సభ్యురాలిగా జాతీయ స్థాయిలో పాల్గొన్న జ్యోతి నీ ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డా జె. నవీన లావణ్య లత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : కలెక్టర్

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-పామర్రు : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పామర్రులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని రక్త పరీక్ష కేంద్రం, మహిళా వార్డు, మందుల విభాగం సందర్శించి వైద్యులతో మాట్లాడారు. శుక్రవారం చేసిన రక్త పరీక్షల్లో మూడు కేసులు టైఫాయిడ్ గా గుర్తించామని వైద్య సిబ్బంది కలెక్టర్కు వివరించారు. వర్షాకాలంలో నీటి కలుషితం కారణంగా టైఫాయిడ్ ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని చెబుతూ అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. ఈ క్రమంలో ఆయన వైద్యం కోసం అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆయన ఆరా తీయగా వారు సంతప్తి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుదేశ్‌బాబు, తాసిల్దార్ రవికాంత్, సీఐ సుభాకర్,ఆర్ఐ.రాము కలెక్టర్ వెంట ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మోపిదేవి : విజయవాడలోని వికాస్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 15 బాయ్స్ అండ్ గర్ల్స్ సాఫ్ట్బాల్ సెలక్షన్స్‌లో మోపిదేవి మండలం కే కొత్తపాలెం హై స్కూల్ విద్యార్థులు మత్తి రేష్మ, పూషడుపు జాహ్నవి,(బాలికల విభాగం) బోట్ల దివ్య తేజ, తూము లలిత్ మణికంఠ, కొక్కిలిగడ్డ బాబి(బాలుర విభాగం) కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 22 23 24వ తేదీలలో విశాఖపట్నం జిల్లా వాల్టేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గరికిపాటి మారుతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గండు కష్ణ ప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ మత్తి నాంచారయ్య, గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి తదితరులు అభినందించారు.

విఎన్‌పురంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

పగిలిపోయిన పైప్ లైన్ పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి శివారు విఎన్‌పురంలో మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం విఎన్ కాలనీలో సిపిఎం నాయకులు పర్యటించారు. వారం రోజులుగా గ్రామస్తులు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు చెప్పారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం తవ్విన గోతులు మంచినీటి పైపులైన్లు పగిలిపోయాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయని కారణంగా తాగునీరు అందక అవస్థలు పడుతున్నామని జనాలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ట్రాక్టర్ తో మంచినీరు పోస్తున్న అందరికీ అందటం లేదన్నారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ మూడువేల జనాభా కలిగిన విఎన్ పురంలో మంచినీటి సమస్యతో జనాలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. స్తంభాలు వెయ్యడానికి ముందే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, ఉడతా రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు అభినందనలు

తహశీల్దారును అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం తాసిల్దార్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎం. హరినాథ్ బాబును సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. మోపిదేవి మండల సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ రాజశేఖర్, కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శిమరీదు సురేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెజవాడ నాగేశ్వరరావు, పార్టీ సభ్యులు మరిది మధుసూదన్ రావు, బెజవాడ రామారావు తహసీల్దాను కలసిన వారిలో ఉన్నారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మేకావారిపాలెం పిఎసిఎస్ సభ్యులు, రైతు తోట కష్ణమూర్తి మృతిచెందగా, కెడిసిసి బ్యాంక్ సభ్యుల సంక్షేమ నిధి ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయల సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు పిఎసిఎస్ ఛైర్ పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ శుక్రవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, సీఈఓ కోరుకొండ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ తులాభారం'

ప్రజాశక్తి - గుడివాడ : ఎంతో మంది కళాకారులను తయారు చేసి కళల కర్మాగారంగా పేరుపొందిన గుడివాడకు మళ్ళీ పూర్వ వైభవం తీసుకువచ్చేలా జానపద, పౌరాణిక, పద్య నాటకాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయమని వంగా వంశీ, ఎస్. మల్లిక్‌లు అన్నారు. గురువారం రాత్రి స్థానిక శ్రీవాసవి కాన్యకపరమేశ్వరి దేవస్థానంలోని కళా ప్రాంగణంలో గణపతి నవరాత్రులు పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి విజయవాడ సౌజన్యంతో శ్రీరాజరాజేశ్వరి నాట్యమండలి గుడివాడ వారిచే బి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలో ప్రదాన పాత్రదారులు పుప్పాల రంగారావు, బి.నాగలక్ష్మీ, గంధం రాజేశ్వరి, ఎస్.కోటేశ్వరి, జి.శివాకుమారి, బి.శోభారాణి తదితరుల ప్రదర్శన ప్రేక్షకులను అలరించారు.

అంబారుపేట వద్ద రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ మండలం అంబారుపేట క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై గుంతలను నేషనల్ హైవే అధికారులు పూడ్చి మరమ్మత్తులు చేశారు. శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి పనులు ప్రారంభించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాది టి విజయకుమార్‌పై పోలీసుల అక్రమ చర్యలను నిరసిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నాగేశ్వరరావు, గొనెల వెంకటేశ్వర్లు, జి శ్రీనివాస గౌడ్, ఎం ఆంజనేయులు, మన్నెం మురళి, పుల నాగరాజు, రావూరి ప్రసాద్, ఎం మనోహర్, గురువులు రాజు, అశోక్, నరేష్, పల్లపు రవి, భిక్షమయ్య, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని చిల్లకల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడాజ్యోతి ర్యాలీలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానవ జీవితంలో అంతర్భాగమని, అవి శారీరక దఢత్వం మాత్రమే కాకుండా మానసిక చురుకుదనం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడల పట్ల మరింత ఆసక్తి కనబరిచి, రాష్ట్రం, దేశానికి కీర్తి తీసుకురావాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో నిర్వహించే ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ప్రతిభావంతులను వెలికితీసి, వారికి ఉన్న అవకాశాలను మరింత విస్తృతం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణ, పిఈటి గంటా వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ మంగ్య నాయక్, పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

వాహన మిత్ర ద్వారా ప్రతి ఆటో కార్మికుడికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సి హెచ్ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని జై దుర్గా భవాని ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్ వద్ద ఆటో కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం సంతోషమని, అదే సందర్భంలో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వాహన మిత్ర పథకం కింద ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి రూ.25 వేలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల ఉపాధ్యక్షులు ఎ విఠల్ రావు, జై దుర్గా భవాని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అంకుశం శ్రీను, మురళీ, శ్రీను, జిలానీ, ఏడుకొండలు,రవి విజయ్ కుమార్ , టాటా మ్యాజిక్ కష్ణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

నివాళులర్పించిన సిపిఎం నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది

ముగిసిన కుటుంబరావు అంత్యక్రియలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

వత్సవాయి ప్రజాశక్తి విలేకరి కరిసే రత్నబాబు తండ్రి కుటుంబరావు అంత్యక్రియలు శుక్రవారం కన్నవీడు గ్రామంలో జరిగాయి. ఆయన మృతదేహాన్ని సిపిఎం జిల్లా నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, చంద్రశేఖర్, జగ్గయ్యపేట, వత్సవాయి మండల కార్యదర్శులు బి రాము, ఎస్ నాగమణి, నాయకులు దారా నాగేశ్వరరావు, షేక్ గౌస్ మియా, ఎం చంద్రశేఖర్, తమ్మినేని రమేష్, గంగుల వెంకయ్య సామా రవి, ప్రజాశక్తి జిల్లా ఇన్చార్జి నాథన్, ప్రజాశక్తి విలేకరులు నారాయణ వెంకట్రావు, లాల్ అహ్మద్ గౌస్, నందిగామ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఎం శ్రీనివాసరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

కండక్టర్ నిజాయితీ

ప్రజాశక్తి - తిరువూరు

ఎపిఎస్ ఆర్‌టిసి తిరువూరు డిపో కండక్టర్ నిజాయితీని ప్రశంసిస్తూ మేనేజర్ సుబ్రహ్మణ్యం ప్రశంసా పత్రాన్ని శుక్రవారం బస్సు స్టేషన్‌లో అందజేశారు. మండలంలోని ఆంజనేయపురం గ్రామానికి చెందిన బొల్లిపోగు వెంకటేశ్వరరావు తిరువూరు బస్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నా రు. ఇటీవల తిరువూరు నుంచి కంచికచర్ల మీదుగా విజయవాడ వెళ్లేందుకు ఒక ప్రయాణికురాలు బస్సులో ప్రయాణిస్తూ తన పర్సును బస్‌లో వదిలేసి కంచికచర్ల బస్టాప్‌లో దిగిపోయారు. విధి నిర్వహణలో ఉన్న బి.వి.రావు ఆ పర్సును భద్రపరిచి, విజయవాడ నుంచి తిరుగు ప్రయాణంలో కంచికచర్ల డిపో కంట్రోలర్ సమక్షంలో ఆమెకు అప్పగించారు. ఆ పర్సులో రూ.లక్ష విలువైన బ్రాస్లెట్, ఒక సెల్‌ఫోన్, రూ.2500 నగదు ఉన్నాయి. దొరికిన విలువైన సొత్తును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించిన కండక్టర్‌ను మేనేజర్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

ప్రమాదంలో గాయపడ్డ

టిడిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ పట్టణం 8వ వార్డు సాయి సదన్ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన టిడిపి సీనియర్ నేత ముక్కపాటి నరసింహారావును శుక్రవారం ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు. ఆమె వెంట నందిగామ మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు ఉన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా

దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇన్చార్జి షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యకరమంలో ఎస్ఎంసి ఛైర్ పర్సన్ ఎస్‌కే బాజీ బీ, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

ప్రజాశక్తి-మైలవరం

ఇటీవల కురిసిన వర్షాలకు వెలవడం నుండి చంద్రాల వెళ్లే రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. అడుగడుగుకు ఒక గుంత పడటంతో ఆ దారిలో ప్రయాణించడం ఇబ్బందిగా మారిందని వాహనదారులు చెప్పున్నారు. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రహదారికి గుంతలు పడి నీళ్లు చేరటంతో చెరువులను తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆ గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు సమయానికి గమ్యస్థానాలను చేసుకోలేకపోతున్నారు. ఇటీవల రహదారికి మరమ్మతులు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. అయితే, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేది ఎప్పుడు, రోడ్డు పోసేది ఎప్పుడు అని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.

గుంతల మయంగా రహదారి

వికలాంగులకు

అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరన్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన వికలాంగులు, చికిత్స కోసం వచ్చిన రోగులు భోజనానికి ఎటువంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రత్యేకంగా అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-వీరులపాడు

మండలం అల్లూరు గ్రామంలోని జూనియర్ కాలేజీ, జిల్లా ఉన్నత పాఠశాలలో బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రెటరీ, ప్యానల్ న్యాయవాది షేక్ ఆజాద్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్, మహిళలకు సంబంధించిన వివిధ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొమ్మినేని మౌళేశ్వరరావు, కోయ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా

సచివాలయ కార్యదర్శి

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు పట్టణానికి చెందిన టీ స్టాల్ మస్తాన్ (సిపిఎం మస్తాన్) కుమార్తె షేక్ నసీరా బేగం గ్రామ సచివాలయ కార్యదర్శి నుంచి జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా మారారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి ఫలితాల్లో నసీరా బేగం జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించారు. గంపలగూడెం మండలం మేడూరు గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షులుగా విధులు నిర్వహిస్తున్న నసీరా బేగం తిరువూరు జన్మభూమి రోడ్డులోని వార్డు సచివాలయానికి బదిలీపై వచ్చారు. అక్కడన తన విధులను అంకితభావంతో నిర్వహిస్తూనే తన జీవిత లక్ష్యమైన బయాలజీ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించి తన చిరకాల కలను నిజం చేసుకున్నారు.

కొటికలపూడి కోఆపరేటివ్

సొసైటీ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొటికలపూడి మెట్రో పాలిటీ ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల శుక్రవారం అధికారులు నిర్వహించారు. పిఏసీ కార్యాలయంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కమిటీ ప్రెసిడెంట్‌గా గంద్రాల దేవదాస్ ప్రెసిడెంట్, సెక్రటరీగా గంద్రాల దాసు, నందిగాం నాగేశ్వరరావు, పత్తిపాటి దాసు, పల్లెపోగు జయరాజు మెంబర్లుగా 43 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : వికేఆర్ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృభాషను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం తెలుగు భాషలో పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** తెలుగు భాషా దినోత్సవం పామర్రు మండలం జుజ్జవరం గ్రామంలో ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం జరిగింది. ఎన్టీఆర్-ఘంటసాల కళా పీఠం అధ్యక్షుడు కాటూరి మురళీకష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యండి.రఫీ, పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకష్ణ,సెక్రటరీ నందిపాటి హేమంత్ రెడ్డి పాల్గొన్నారు. .ఈ సందర్భంగా ఉపాధ్యాయుని జయశ్రీని దశ్యాలువతో సత్కరించారు. **ప్రజాశక్తి, గుడ్లవల్లేరు :** మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్, స్థానిక సంస్థలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో మాతభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. మహాలక్ష్మి , తెలుగు ఉపాధ్యాయురాలు ఎన్ వాసవి, ఉపాధ్యాయులు కె. నాగబాబు, నాంచారమ్మ, ఆంజనేయరాజు, రత్నకుమారి పాల్గొన్నారు.అలాగే గుడ్లవల్లేరులోని శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు) అధ్యర్యంలో పాఠశాలలో తెలుగుతల్లి, రామ్మూర్తి చిత్ర పటాలకు పూలు దండలు వేశారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దప్రోలులో తెలుగు భాషా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పద్యాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఉపాధ్యాయిని దిడ్ల ప్రసన్న రాణిని సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవి రమణ, ఉపాధ్యాయ కార్యదర్శి విశ్వనాథపల్లి సాంబశివరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం పెడసనగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలలో తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** తెలుగు భాషాదినోత్సవం పురస్కరించుకుని ఏజీఅండ్ ఎస్ ఎస్ కళాశాల తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రోపన్యాసకుడు వలివీటి వెంకట శివరామకష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపా ల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, తెలుగు శాఖాధిపతి ఎంఎల్ఎస్ కుమారి అన్వర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** కొమ్మారెడ్డి స్కూల్‌లో పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు కవులు, కవయిత్రుల వేషధారణతో సుమారు 20 మంది విద్యార్థిని, విద్యార్దినులు అందరిని అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. స్కూల్ సెక్రెటరీ కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి స్కూల్ హెచ్.ఎం ఎన్.శ్రీనివాసరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ తెలుగు భాషా దినోత్సవవేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ .జగన్ మోహనరావు, తెలుగు శాఖాధి పతి ఆచార్య. డాక్టర్. జి.బి .ఆనందకుమార్, ఆంగ్ల శాఖ అధిపతి బి దేవ జయరాజు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** తెలుగు భాష దినోత్సవ వేడుకలు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహకులు, మండలి వెంకటకష్ణారావు విగ్రహాలకు యువ నాయకులు మండలి వెంకట్రాం పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కునప రెడ్డి చంద్రశేఖర్, డి సి వై చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, కూటమి నాయకులు కొట్టే విజయ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** తెలుగు భాష అన్ని భాషల్లోకెల్లా గొప్పదని అయినపూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు వేణుగోపాల రావు అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం, తాడంకి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గిడగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలం కొమ్మారెడ్డి పాఠశాలలో...

గుడ్లవల్లేరు మండలంలో..

పమిడిముక్కల మండలంలో...

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండలంలోని కలవపాముల గ్రామంలో స్థానిక సమస్యలు అనేకం ఉన్నాయని వాటి పరిష్కారం కోరుతూ సిపిఎం గ్రామ సభ్యులు కలవపాముల పంచాయతీ కార్యదర్శి సిబ్బందికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ముఖ్యంగా వీధిలైట్లు వెలగడం లేదని, వర్షాలకు వర్షపునీరు నిలవండటంతో అధికంగా దోమలు ప్రబలుతున్నాయని సీసీ రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని వీధి కుక్కల ప్రభావంతో పిల్లలు వద్దులు ఇబ్బంది పడుతున్నారని పలు సమస్యలతో కూడిన వినతి పత్రం గ్రామ సచివాలయంలో అందజేశారు. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కే శివ నాగేంద్రం, జిల్లా కమిటీ సభ్యులు పి.పవన్ కుమార్, దేవదానం, జాన్ కోటయ్య, రవి కిరణ్, అంజయ్య, బాలకోటయ్య రాజేష్, ప్రవీణ్తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్ నుంచి పెడన వైపు వెళ్లే బైపాస్ రోడ్ లో వాసవి భవన్ దగ్గర వినాయక చవితి మండపంలో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బైపాస్ రోడ్డు ఆర్గనైజింగ్ బాయ్స్ కమిటీ నిర్వాహకులు పోతన రాజా, తోటకూర తులసిరావు, కొత్తూరు మూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా 5116 రూపాయల ప్రైజ్ మనీని కే భవాని గెలుచుకున్నారు. రెండో బహుమతిగా 3116 రూపాయల ప్రైజ్ మనీని బి అరుణ గెలుచుకున్నారు. మూడో బహుమతిగా 2116 రూపాయల ప్రైజ్ మనీని ఎస్కే యామిని గెలుచుకున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో ప్రతిరోజు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, సెప్టెంబర్ 4న వినాయక నిమజ్జనం ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పశువైద్యశాలలో సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలో రావి వీరభద్రయ్య మెమోరియల్ బహుళార్థ వైద్యశాల శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 29వ తేదీన 'శిథిలావస్థలో పశువైద్యశాల భవనం' వార్తకు పశువైద్యశాల అధికారులు శుక్రవారం స్పందించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం చేసి పశువైద్యశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



మోపిదేవిలో కార్డులు అందిస్తున్న దృశ్యం

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం స్మార్ట్ కార్డులను పిఏసిఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మెరకనపల్లి గ్రామ పంచాయతీలోని మూడు రేషన్ షాపుల పరిధిలో మొత్తం 719 స్మార్ట్ కార్డులు వచ్చినట్లు వీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యన్నా వెంకట శ్రీనివాసరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు .**ప్రజాశక్తి-పమిడిముక్కల :** మండలంలోని అన్ని గ్రామాల్లో స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామని తహశీల్దార్ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని లంకపల్లి, కృష్ణాపురం, తాడింకి తదితర గ్రామాల్లో కార్డులు పంపిణీ చేశామన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులు సులభంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని కృష్ణా జిల్లా రైతు అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు.ప్రభుత్వం నూతనముగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు గురువారం స్థానిక పార్టీ నేతలతో మచిలీపట్నం రూరల్ మండలం కానూరు గ్రామంలో పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర రావు,వి ఆర్ ఓ దాస్, పీత రాము తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

అవనిగడ్డలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ గ్రామ పంచాయతీ పరి ధిలో పులిగడ్డ పెను ముడి వంతెన సమీపంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేశారు. విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం అవనిగడ్డ సీఐ జి శివకుమార్ ఎస్సై కే శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌తో కలిసి బ్రిడ్జి సమీపంలో నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. కాగా పంచాయతీ ఈవో బి అనిత, టోల్గేట్ సిబ్బంది పులిగడ్డ పెనుముడి బ్రిడ్జి దగ్గర ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన్న ప్రదేశాలను గుడివాడ డీఎస్పీ ఉత్తర్వుల మేరకు శుక్రవారం స్థానిక అధికారులు పరిశీలించారు. మండల తాసిల్దార్ బి లోకరాజు, ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది కలిసి పరిశీలించి గణేష్ నిమజ్జన సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా భారీకేడ్లు, లైటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు.

శరవేగంగా ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ

రోడ్డును వెడల్పు చేసిన దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలోని ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి విస్తరణ పని మొదలుపెట్టి మూడు నెలలు అవుతుంది. ఈ రోడ్డు విస్తరణ పనులకు కోటిన్నర రూపాయలు బడ్జెట్ పెట్టారు. కాంట్రాక్టర్ యలమంచిలి వెంకటరత్నం పనులు చేపట్టారు. మిషనరీ మొత్తాన్ని డంప్ చేసి సిమెంట్ కాంక్రీట్ పనులు చేయిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే కందగట్ల వెంకటేశ్వరరావు బిల్డింగ్ నుంచి కూర్మాల రాము బిల్డింగ్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారు. రెండు రోడ్ల కూడలి కావడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా డ్రైనేజీని అతిపెద్ద కాంక్రీట్ దిమ్మలతో నిర్మిస్తున్నారు. సగం పనులు ముందు పూర్తి చేసి ఆరోడ్ బ్లాక్ చేసి మరోవైపు పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు రోడ్డును పెద్దగా విస్తరిస్తున్నారు. మధ్యలో ఉన్న పాత డివైడర్ను తొలగించి కొత్త డివైడర్ నిర్మాణం పూర్తి చేశారు. డివైడర్ కు రెండువైపులా సుమారు 100 మీటర్ల పొడవున రహదారి నిర్మాణం చేయాల్సి ఉంది. అందులో భాగంగా పాత రోడ్డుకు ఆనుకుని 30 అడుగుల పొడవున రోడ్డును విస్తరిస్తున్నారు. కింద నుంచి దానిని బలోపేతం చేస్తున్నారు. రోడ్ కు రెండువైపులా డ్రైనేజీ నిర్మాణం కూడా పూర్తి చేశారు. విస్తరణ పనులు పూర్తికాగానే కొత్త రోడ్డు నిర్మాణం చేయిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రోడ్డుకు రెండు వైపులా విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే ఆక్రమణ దారులు రోడ్డు విస్తరించిన తాము మాత్రం ఆగేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉందని గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు చెప్తున్నారు. ఒకవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా మరోవైపు ఆక్రమణదారులు తమ పని చేసుకుపోతున్నా.. పంచాయతీ అధికారులు గానీ, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు గానీ దీనిపై కన్నీటితో చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదైనా రహదారి విస్తరణ పనులు ఇంకో నెల రోజులు పాటు కొనసాగే అవకాశం ఉంది. పంచాయతీరాజ్ ఏఈ దాసు పనులను పర్య వేక్షిస్తున్నారు.

యూరియా అక్రమాలపై విచారించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఎ.కొండూరు

ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి , వరి, మిర్చి, మొక్కజొన్న, తదితర పంటలకు అవసరమైనటువంటి యూరయాను మండల వ్యవసాయ శాఖాధికారులు పక్కదారి పట్టించడంపై జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎ. కొండూరులోని సుందరయ్య భవన్‌లో సిపిఎం ఎ కొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలలో నిల్వ ఉంచాల్సిన యూరియాను మండల వ్యవసాయశాఖాధికారి మార్క్‌ఫెడ్ ద్వారా వచ్చిన యూరియాను మండలంలోని చీమలపాడు, ఎ. కొండూరులోని కొన్ని ప్రైవేటు ఎరువుల దుకాణాలకు తరలించడం దారుణమన్నారు. యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు పడుతూ బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేస్తూ ఉంటే మరోపక్క వ్యవసాయ శాఖాధికారి యూరియాను ప్రైవేట్ దుకాణాలకు తరలించడం సరికాదన్నారు. యూరియా కట్టను రూ.266.55లకు అమ్మాల్సి ఉండగా ప్రైవేటు దుకాణదారులు రూ.300 నుండి 350 రూపాయల వరకు అమ్ముతున్నారని, యూరియా కట్ట కావాలంటే కాంప్లెక్స్ ఎరువును కొనాలని ప్రైవేటు ఎరువుల దుకాణదారులు రైతులను ఇబ్బందులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ళ అమ్మిరెడ్డి, రావుల రామకృష్ణ, బొమ్మిన శ్రీను, తాళ్లూరి తిరుపతిరావు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

మొక్కల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి-మైలవరం

స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సేంద్రియ పద్ధతిలో మొక్కల పెంపకం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సర్టిఫికెట్ కోర్సును కళాశాలలో చదివే ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో పెంచుకునే పూల మొక్కల నుండి పండ్ల మొక్కలు కూరగాయ మొక్కలను సేంద్రియ పద్ధతిలో ఎలా పెంచుకోవాలో ఈ సర్టిఫికెట్ కోర్సు ద్వారా తెలుసుకోవచ్చున్నారు. కెమికల్ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ ఎక్కువగా వాడటం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వీటిని అతిక్రమించాలంటే సేంద్రీయ పద్ధతిలో మొక్కలను పెంచుకోవలసిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

గోపాల్ మాస్టారుకు ప్రజాసేవా రత్న అవార్డు

ప్రజాశక్తి-మైలవరం

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయిన మైలవరానికి చెందిన పల్లబోతుల గోపాల్‌ను ప్రజాసేవా రత్న అవార్డుతో ఘనంగా సత్కరించినట్లు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా ఆయన తెలిపారు. విద్యార్థులను మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించటం, విద్యార్థులను ఉపాధివైపు నడిపిస్తూ ఆయన చేసిన సోషల్ సర్వీస్‌ను గుర్తించి గుంటూరుకు చెందిన ఆచార్య చారిటబుల్ ట్రస్ట్ వారు సత్కరించి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. గోపాల్ మాస్టారుకి ప్రజాసేవా రత్న అవార్డు రావడం పట్ల మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు ఆయనను అభినందించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- చటన్నవరం గ్రామ మాజీ సర్పంచ్ మాతంగి విజయ కుమార్

ప్రజాశక్తి-వీరుపాడు

మండంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయనిచటన్నవరం గ్రామ మాజీ సర్పంచ్ మాతంగి విజయ కుమార్ తెలిపారు. దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

46 శాతం పెరిగిన రెడ్‌బస్ ప్రయాణాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వినాయక చవితికి ప్రజల ప్రయాణాలు 46 శాతం పెరిగాయని అతిపెద్ద ఆన్‌లైన్ బస్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ రెడ్‌బస్ సంస్థ ప్రతినిధి ఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగాయని తెలిపారు. మరోవైపు హైదరాబాద్, బెంగళూరు నగరాలు ఎక్కువ మంది ఎంచుకున్న డెస్టినేషన్‌గా మారాయన్నారు. ఎపి నుంచి పండుగ ప్రయాణంలో ఎక్కువగా యువత ప్రయా ణించారని, మొత్తం డిమాండ్‌లో 21 నుండి 35 సంవత్సరాల వయస్సు గలవారు 55 శాతం ఉన్నారన్నారు. ఇందులో పురుషులు 65 శాతం ఉండగా, మహిళలు 35 శాతంగా ఉన్నారన్నారు. ఎక్కువగా విజయవాడ-హైదరాబాద్, తిరుపతి- బెంగళూరు, తిరుపతి-హైదరాబాద్, విశాఖపట్నం-హైదరాబాద్, నెల్లూరు-బెంగళూరు ప్రాంతాలకు ప్రయాణాలు జరిగాయన్నారు.

శామ్‌సంగ్ ఇమేజింగ్ మెడికల్ పరికరాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి -విజయవాడ అర్బన్

అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, ఆధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ పరికరాలను స్వీకరించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్‌జె .ఎస్.రావ్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. డయాగ్నొస్టిక్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీని మార్చడానికి ప్రత్యేకంగా రూపొందించిన ఈ తదుపరి తరం వ్యవస్థలను అందిస్తుంది అని తెలిపారు. ఇవి మొబిలిటీ, ఏఐ-సహాయక సామర్థ్యం, రోగి-మొదటి రూపకల్పనను మిళితం చేస్తూ, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు ఎప్పుడైనా, ఎక్కడైనా నాణ్యమైన సేవను అందించడానికి సాధికారత కల్పిస్తాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి శ్రేణి పరికరాలు ఆసుపత్రులు, ప్రత్యేక కేంద్రాల వివిధ క్లినికల్ అవసరాలను తీర్చడానికి రూపొందించ బడ్డాయన్నారు. అన్ని ఆసుపత్రుల్లో, ప్రత్యేకంగా సేవలు తక్కువగా లభించే ప్రాంతాల్లోనూ, ఈ వ్యవస్థల ఉపయోగాన్ని సాధ్యం చేయడంతో, ఆధునిక ఇమేజింగ్ సేవలకు సమాన అవకాశం కల్పించడానికి శామ్‌సంగ్ ముందడుగు వేస్తోందని తెలిపారు.

'లిటిల్ బ్రెయిన్'లో తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

స్థానిక సిద్దార్థనగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ ముక్తేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు భాష ఔనిత్యం, విశిష్టత గురించి పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అచ్చులతో రామాయణం, అమ్మ భాష గొప్పతనం, వర్ణమాల నృత్యం, మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గిడుగు రామ్మూర్తి గొప్పతనాన్ని తెలియచేస్తూ విద్యార్థులు చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఫణిప్రసాద్ ముక్తేవి ప్రసంగిస్తూ భావితరాలకు తెలుగు భాష ఔనిత్యని చాటిచెప్పాలని సూచించారు.

నందిగామలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి- నందిగామ

నందిగామలో ప్రజా దర్బార్ వేదికగా వచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నందిగామ పట్టణం కాకాని నగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం తంగిరాల సౌమ్య ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కష్ణకుమారి, నందిగామ మండల ఎమ్మార్వో సురేష్, మున్సిపల్ కమిషనర్ లోవరాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రజలు నేరుగా తమ వినతులు, సమస్యలు, అభ్యర్థనలను తెలియజేసి పరిష్కరించాలని కోరగా వెంటనే ఆమె స్పందిస్తూ ప్రజల ఇబ్బందులను వాయిదా వేయకుండా పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

సరికొత్త వింగర్ ప్లస్‌ను ఆవిష్కరించిన టాటా మోటార్స్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సిబ్బంది రవాణా, పెరుగుతున్న ప్రయాణ, పర్యాటక విభాగం కోసం రూపొందించబడిన ప్రీమియం ప్యాసింజర్ మొబిలిటీ ఉత్పత్తి అయిన సరికొత్త 9-సీటర్ టాటా వింగర్ ప్లస్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి ఎస్.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య వాహన తయారీదారు అయిన టాటా మోటార్స్ తాజాగా మార్కెట్లోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. వింగర్ ప్లస్ ప్రయాణీకులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఫ్లీట్ యజమానులు తక్కువ మొత్తం యాజమాన్య ఖర్చుతో అధిక సామర్థ్యం, లాభదాయకతను సాధించడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. రూ.20.60 లక్షలు (ఎక్స్-షోరూమ్,) ధరతో డిజైన్, ఫీచర్లు, సాంకేతికతలను మిళితం చేస్తుందని తెలిపారు.

కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాంకు సన్మానం

ప్రజాశక్తి- నందిగామ

నందిగామలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్‌కు పలువురు సన్మానం చేశారు. నందిగామ పట్టణంలో ఇటీవల సిఎం ప్రారంభించిన వీరులపాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు కడియాల నరసింహారావు కుమారుడి అశ్వ డెంటల్ క్లినిక్ ఇంప్లిమెంట్ సెంటర్‌ను శుక్రవారం రఘురాం సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

కెబిఎన్ సేవలు స్ఫూర్తిదాయకం

- ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాంబశివరావుకు సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలతో సహా అనేక సామాజిక సమస్యలు ఏర్పడిన సందర్భాల్లో ఉత్తమ నిబద్ధతతో పనిచేసి, జిల్లా కలెక్టర్ నుంచి విశిష్ట సేవా పురస్కారం అందుకున్న సాంబశివరావు సేవలు స్ఫూర్తిదాయకం అని పలువురు వక్తలు కొనియాడారు. కెబిఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.సాంబశివరావు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నుంచి విశిష్ట సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా శుక్రవారం కళాశాలలో అభినందన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ దసరా ఉత్సవాలు, భవానీ దీక్షలు, ట్రాఫిక్ నియంత్రణ, అవయవదానం వంటి అనేక సేవా కార్యక్రమాలను సాంబశివరావు తన విద్యార్థి బృందంతో నిర్వహించారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ చేపట్టిన ప్రతి సేవా కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా అత్యంత అంకితభావంతో చేయడం సాంబశివరావు ప్రత్యేకత అన్నారు. కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ సేవాకార్యక్రమాల నిర్వహణతో పాటు విద్యార్థులను సామాజిక సమస్యలపై పోరాడేలా స్ఫూర్తి దాయక ప్రసంగాలు చేయడంలోనూ సాంబశివరావు ప్రతిభావంతుడన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.